

ట్యాంకర్ లారీని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

విశాలాంధ్ర - పీఎం పాలెం: పీఎంపాలెం న్యాయ కళాశాల కూడలికి సమీపంలో ఆదివారం తెల్లవారు జామున 4.30 గంటలకు రోడ్డు ప్రమాదం జరిగింది. ట్యాంకర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. మధురవాడ ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువకుడు అక్కడక్కడ మృతి చెందాడు. కొండల జస్వంత్ (22) జిమ్ ట్రైనర్, సాయిప్రియ లే అవుట్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. తండ్రి రమేష్ ఆటో డ్రైవర్ గా చేస్తున్నారు. అతివేగంగా రావడంతోనే ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలియజేశారు. ఒకడు మృతి కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదం తెలిసిన వెంటనే పీఎం పాలెం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పీఎం పాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేరుకే ఎన్నికల కోడ్
ఫోన్‌లోనే పెత్తనం

అధికారులపై అధికార పార్టీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి

తలలు పట్టుకుంటున్న అధికారులు

జీవీఎంసీలో మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్ల సిఫార్సులపై అధికారుల ఆవేదన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పేరుకే సార్వత్రిక ఎన్నికల కోడ్ అయినప్పటికీ అధికార పార్టీ వైసీపీ ప్రజా ప్రతినిధులు అధికారులపై మరింత ఒత్తిడిని తీవ్రతరం చేశారు. తమ చాంబర్లకు పిలిపించుకొని చెప్పకపోయినప్పటికీ, ఫోన్లలోనే పెత్తనం చెలాయిస్తున్నారని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల్లో తమ పార్టీ గెలవాలంటే తాము చెప్పే పనులన్నీ చేయాల్సిందేనని అధికారులపై హుకుం జారీ చేస్తున్నారు. ముఖ్యంగా జీవీఎంసీలో మేయర్, డిప్యూటీ మేయర్లు, పలువురు పాలకవర్గంలో కీలక అధికార పార్టీ కార్పొరేటర్లు భారీగా దందా చేస్తూ ఎన్నికల ఖర్చులకు దోహదపడేలా పనులు చేయించుకుంటున్నారని తెలుస్తోంది. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ వనులను పూర్తిచేయాలని అధికారులపై తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నట్లు కొంతమంది అధికారులు తెలియజేస్తున్నారు. మరోపక్క వార్డుల్లో తమ ఫ్లెక్సీలను, ప్రచార సామగ్రిని తొలగించడానికి వస్తే ఊరుకునేది లేదని పలువురు కార్పొరేటర్లు టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై చుర్రు బుర్రులాడుతున్నారు. అనధికార అంతస్తులు నిర్మించుకుంటామని వాటి జోలికి రావద్దని హుకుం జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. జీవీఎంసీ పరిధిలో 98 వార్డులో అనేక అనధికార నిర్మాణాలకు అధికార పార్టీ నేతలే పెద్ద ఎత్తున సిఫార్సులు చేస్తూ లక్షల్లో ముడుపులు దండుకుంటూ అండగా నిలబడుతున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కూల్చివేతలకు వెళితే తమపై హెచ్చరికలు చేస్తున్నారని పలువురు అధికారులు ఆవేదనకు గురవుతున్నారు. కొన్ని సమస్యాత్మక వనులను ఎమ్మెల్యేలు, ఇన్చార్జిలతో తమపై ఒత్తిడి తీసుకువస్తున్నారని, మళ్లీ తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, తాము చెప్పినట్లు చేయకపోతే మీ సంగతి చూస్తామంటూ బెదిరింపు చర్యలకు దిగుతున్నారని కొంతమంది అధికారులు వాపోతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన నుండి మరింత తమపై ఒత్తిడి పెరిగిపోయిందని ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఓ డిప్యూటీ మేయర్ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన అపార్ట్మెంట్‌కు ఎన్‌ఓసి ఇవ్వాలని ఓ మహిళ అధికారిణిపై తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ స్థలాలను సైతం ఆక్రమించుకొని నిర్మించుకుంటున్న భవనాలు జోలికి వెళ్ళొద్దని షాడో మేయర్ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నట్లు తెలుస్తుంది. లక్షల్లో సెటిల్మెంట్లు చేసుకుంటూ దోచుకుంటున్న అధికార ప్రజాప్రతినిధులు కొంతమంది ఎన్నికల కోడ్‌ను తమకు అనుకూలంగా మలుచుకుని గుట్టు చప్పుడు కాకుండా పనులు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి అధికారులంతా లోపాకారకంగా క్రింద స్థాయి అధికారులపై తీవ్ర ఒత్తిడితో అధికార పార్టీ నేతలకు తలొగ్గి పనిచేస్తున్నారని విస్తృత ప్రచారం సాగుతుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సైతం తమ పదవి కాలం అయిపోయిన, తాము ఇంకా అధికార పార్టీ ప్రజాప్రతినిధులమే అంటూ అధికారులపై పెత్తనాన్ని కొనసాగిస్తున్నట్లు అనేకమంది సిబ్బంది లబోదిబోమంటున్నారు. జీవీఎంసీలో ప్రతి వార్డులో పదుల సంఖ్యలో అనధికార అంతస్తులు నిర్మాణాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. ఎన్నికల కోడ్ సాకు చూపి భారీ నిర్మాణాలకు తెర లేపారు. జీవీఎంసీకి రావాల్సిన లక్షల రూపాయల ఆదాయానికి గండి కొట్టేలా కొంతమంది పాలక పెద్దలే సూత్రధారులుగా మారిపోతున్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు పాలకవర్గంలో ఆమోదింపు చేసిన పనులను కొన్నింటిని యుద్ధ ప్రాతిపదికన తమ వార్డుల్లో చేపట్టాలని మరి కొంతమంది పాలకవర్గ పెద్దలు అధికారులపై తీవ్ర ఒత్తిడిని పెంచినట్లు తెలుస్తోంది. ఈ అభివృద్ధిని చూపించి ఎన్నికల ప్రచారానికి వెళ్లాలని అంటున్నారు. యుద్ధ ప్రాతిపదికన రోడ్ డెవలప్మెంట్ ప్లాన్లు పేరిట విస్తరణలు హడావిడిగా చేపట్టించి, రోడ్ల నిర్మాణంతో పాటు పార్కుల ఆధునీకరణ వంటి పనులకు హడావిడిగా పూర్తి చేయాలని, తద్వారా కాంట్రాక్టర్లు నుంచి భారీగా ముడుపులు ఇవ్వాలని పాలకవర్గంలో షాడో మేయర్లు కొంతమంది చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. వీరు చేసిన అక్రమాలు, పాపాలే వచ్చే ఎన్నికల్లో గుణపాఠంగా మారుతుందని వార్డుల్లో ప్రజలు, కొంతమంది అధికారులు తెలియజేస్తున్నారు.

మాజీ మంత్రి బండారుకు అస్వస్థత

విశాలాంధ్ర - పెందుర్తి: మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తి ఆదివారం అస్వస్థతకు గురయ్యారు. పరవాడ మండలం వెన్నెల పాలెంలో గల తన నివాసంలో రక్తపోటుకు గురై ఇబ్బంది పడటంతో అతని కుమారుడు అప్పలనాయుడు తదితరులు హుటాహుటిన నగరంలోని ఆయుష్మాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు, వైద్యులు వెల్లడించారు. బండారు అస్వస్థత గురించి తెలుసుకున్న విశాఖ టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి భరత్, ఎమ్మెల్సీ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బండారు అభిమానులు ఆసుపత్రికి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కాగా పెందుర్తి అసెంబ్లీ సీటును ఆశించిన బండారుకు, కూటమి పొత్తులో భాగంగా సీటు దక్కలేదు. దీంతో టీడీపీ శ్రేణులు గత కొన్నాళ్లుగా పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నాయి. బండారుకి టీడీపీ సీటు ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తూ నిరసనలు కొవ్వొత్తుల ర్యాలీలు చేపట్టాయి. పార్టీ వీరాభిమాని అయిన బండారు టీడీపీలో జరుగుతున్న గందరగోళ పరిస్థితులపై కాసింత ఆవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో ఆయన అనారోగ్యానికి గురయ్యారని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. బండారు త్వరగా కోలుకొని ఇంటికి చేరుకోవాలని ఆ పార్టీ నాయకులు పలువురు దేవాలయాలలో ప్రార్థనలు చేశారు.

ఐకమత్యంలో యజ్ఞం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి శ్రీ సుదర్శన నరసింహ మహా యజ్ఞంకు సంబంధించి కార్య నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాస మూర్తి సమావేశం ఏర్పాటు చేశారు. ఈఓ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం సింహగిరిపై పదేళ్ల తరువాత జరుగుతున్న శ్రీ సుదర్శన యజ్ఞం ఈనెల 26 నుంచి ఏప్రియల్ 1వ తేది వరకు జరుగుతుందని అన్నారు. మంగళవారం సాయంత్రం యజ్ఞానికి అంకురార్పణ చేయనున్నట్టు తెలియజేసారు. బుధవారం ఉదయం అగమోక్తంగా యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటి వరకు 1049 టిక్కెట్లు తీసుకున్నారన్నారు. మరింత మంది భక్తులు యజ్ఞంలో భాగస్వాములు కావడానికి అసక్తి చూపుతున్నారని తెలిపారు. దర్శనానికి వచ్చే వారి పట్ల మర్యాద పూర్వకంగా ప్రవర్తించాలని చెప్పారు. సమవేశంలో కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈఓలు అనందకుమార్, పాలూరి నర్సింగరావు, నరసింహరాజు వర్మ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న తులసి, పుష్పాలతో అగరబత్తుల తయారీ

విశాలాంధ్ర - గోపాలపట్నం: పండగల సమయంలోనే కాదు.. రోజూ మనం పూజ చేశాక, వాడిపోయిన తులసి పూలను పారేస్తూ ఉంటాం. లేదా పారే నీళ్లలో వది లేస్తాం. ఐతే ఆ పూలను వృథాగా పారేయకుండా ధూపం తయారు చేసుకోవచ్చు. అగరబత్తీలు తయారీ కోసం బహిరంగ వేలం నిర్వహించి తద్వారా దేవస్థానంకి మూలధనం చేకూరుతుంది అనిచెప్పాలి. అగరబత్తులు తయారీని ప్రారంభించారు. తులసి, పుష్పాలు మాలలు అగరబత్తులుగా మారి ఆధ్యాత్మిక పరిమళాలు వెద జల్లుతున్నాయి. స్వామివారి నిత్య కైంకర్యానికి వినియోగించిన పూలు, తులసి, ఇక్కడ ధూప్ స్టిక్కులుగానూ, అగరబత్తులు గాను రూపాంతరం చెంది భక్తులను పరవశింప జేస్తున్నాయి. పుష్పాలు, తులసి మాలలతో అగరబత్తుల తయారీ ఊపందుకొని, భక్తుల చెంతకు చేరి, అవి పరిమళాలు వెదజల్లుతున్నాయి. తక్కువ ధరలో ఇక్కడ అగరబత్తీలు దొరకుతుండటంతో వాటి కొనుగోలుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. విక్రయ కేంద్రం ద్వారా పుష్ప పరిమళభరిత సహజ అగర బత్తి విక్రయిస్తున్నారు. అయితే ఈ క్షేత్రంలో మాత్రం లక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో సింహాచలం సంపంగి, తులసి వనమాలి, పారిజాత పరిమళం, చందనం ఫ్లేవర్, పేరిట దొరికే ఎనిమిది రకాల అగరబత్తులను 60 గ్రాములను రూ.50లు, 120 గ్రాములను రూ.100లకే విక్రయిస్తున్నారు. కేవలం రూ.100 రూపాయలకే విక్రయిస్తుండటంతో భక్తులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. వరాహ లక్ష్మి నరసింహ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్లు, ఉత్సవ మూర్తులు, ఇతర దేవతామూర్తులకు వినియోగించి ఆ తర్వాత తొలగించిన పుష్పాలు, తులసి దండలను వీటి తయారీలో విరివిగా ఉపయోగిస్తారు. మూడు రోజులపాటు ఎండబెడతారు. ఆ తర్వాత యంత్రం ద్వారా పొడిగా మార్చి, ఇందులో సుగంధ ద్రవ్యాలు, జిగురు కలిపి యంత్రాల ద్వారా అగరబత్తులు తయారు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేస్తున్న భక్తులు సాక్షాత్ శ్రీమన్నారాయణుడు తమ ఇంట్లో కొలువైనట్టు ఆనందపారవశ్యాన్ని పొందుతున్నారు.

క్షయను శాశ్వతంగా నిర్మూలిద్దాం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో క్షయ మహ మ్మారిని శాశ్వతంగా నిర్మూలించేందుకు జిల్లా యంత్రాంగం కలిసికట్టుగా కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లి కార్జున పేర్కొన్నారు. ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ, క్షయ నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఆదివారం జరిగింది. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అవగాహనా ర్యాలీకి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్న క్షయ మహమ్మారిని కలిసికట్టుగా తరి మికొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.జగదీశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత క్షయ వ్యాధికారక సూక్ష్మక్రిములను తొలిసారి గుర్తించిన డా.రాబర్ట్ కోచ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డా. సిహెచ్. పూర్ణేంద్రబాబు, ప్రభుత్వ చెస్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. ఆర్.సునీల్ కుమార్, ఎంఓడిటిసి డా.సత్యవేణి, పెందుర్తి సూపరింటెండెంట్ డా. ఎస్.ఆర్.కె.దొర, శ్రీకాకుళం విశ్రాంత జిల్లా టీబీ నియంత్రణ అధికారి డా.ఎస్.అనూరాధ, జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి.ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. గాజువాక పరిధిలో గల పెదగంట్యాడ పిహెచ్‌సిల పరిధిలో ఉన్న టి బి వ్యాధిగ్రస్తులుకు విశేష సేవలు అందించిన సమన్వయకర్త నవదుర్గారావుకు ఉత్తమ ప్రతిభా సేవా పురస్కారం అవార్డు ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైద్య సిబ్బంది అభినందనలు తెలియజేసారు.

చర్మ వ్యాధులపై గీతం జిమ్‌సర్‌లో అవగాహన

విశాలాంధ్ర - మధురవాడ: చిన్న పిల్లలలో కనిపించే చర్మ వ్యాధులు, వాటికి గల కారణాలు, చికిత్సా విధానాలపై రాష్ట్రంలోని పి.జి. వైద్యవిద్యార్థులకు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) డి.వి.ఎల్. విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిరంతర వైద్య విద్య తరగతులు నిర్వహించారు. వివిధ వైద్య కళాశాలల నుంచి 250 మంది పి.జి.వైద్య విద్యార్థులు దీనికి హాజరయ్యారు. జిమ్‌సర్ ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, డీన్ డాక్టర్ ఎస్.పి.రావు హాజరై వైద్యులకు దిశా నిర్దేశం చేశారు. జిమ్‌సర్ డి.వి.ఎల్.విభాగాధిపతి డాక్టర్ బి.వి.ఆర్.రామచంద్ర మాట్లాడుతూ 12 నుంచి 14 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నపిల్లలో సంభవించే చర్మ వ్యాధుల పై వైద్యవిద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలోని ప్రముఖ చర్మ వ్యాధుల చికిత్సా నిపుణులు రిసోర్స్ పర్సన్‌లుగా హాజరై వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమానికి డాక్టర్ రాహుల్ రాయ్, డాక్టర్ కె.హరిత, డాక్టర్ ఫర్జానా సంధాన కర్తలుగా వ్యవహరించారు.

డ్రగ్స్ మాఫియాను విస్తరించడమే వైసీపీ లక్ష్యమా

విశాలాంధ్ర - భీమిలి: డ్రగ్స్ మాఫియాను విస్తరించడమే వైసీపీ లక్ష్యంగా కనిపిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఈ ఐదేళ్ల కాలంలో డ్రగ్స్, మాఫియా ఎంతలా విస్తరించిందో రాష్ట్ర ప్రజలు గమనించాలని అన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ ఓడిపోతామనే భయంతో ఇలాంటి చిందులకు తెరతీస్తున్నారని అన్నారు. అవకాశం ఉన్నంతవరకు సంపాదించుకోవాలనే ఆలోచన తప్ప రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం ఎలాంటి ఆలోచన లేదని అన్నారు. బ్రెజిల్ కేంద్రంగా తాడేపల్లి పేలస్‌కి ముడుపులు అందేవిధంగా చేసే ప్రయత్నంలో సిబిఐ అధికారులకు అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఇంకా మున్ముందు ఎన్నికలు దగ్గర పడుతున్న కొలది ఎలాంటి విన్యాసాలు ఈ వైసీపీ ప్రభుత్వంలో చూడవలసి వస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటారో, యువతకు ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయో, మహిళలకు రక్షణ ఉంటుందో, రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందో అర్థం చేసుకొని ప్రజలు ఓటువేసి మీ అభిమాన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు.

ఆనందపురం పీహెచ్‌సీకి నాలుగు అవార్డులు

విశాలాంధ్ర - ఆనందపురం: క్షయ వ్యాధి నివారణలో విశేష కృషి చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆనందపురం సిబ్బంది అధికారులకు 4 అవార్డులు వచ్చాయి. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు బహూకరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్య అధికారి సాంబమూర్తి, ఎంఎల్‌హెచ్ సూర్యకళ, ఏఎన్ఎం కుప్పు దేవి, ఆశ గంగాభవానిలకు ఈ అవార్డులు వచ్చాయి. ఈ సందర్భంగా వీరికి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గంగు నాయుడు, షహనాజ్ సాధియ, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విశాఖలో తుపాకీల అలజడి

పోలీసుల అదుపులో వ్యక్తి మరొకరి కోసం గాలింపు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: ఎన్నికల వేళ విశాఖలో తుపాకీల లభ్యం తీవ్ర అలజడి రేపింది. విశాఖలో ఇప్పటికే బ్రెజిల్ నుంచి వచ్చిన డ్రగ్స్ కలకలం రేపుతోంటే, మరోవైపు రెండు తుపాకీల ఆచూకీ మరింత ఆందోళనలోకి నెట్టేస్తోంది. ఇప్పటికే విశాఖలో నిత్యం ఎక్కడో చోట గంజాయి ఆనవాళ్లతో పాటు రెండు చోట్ల నిషేధిత ఎలక్ట్రిక్ సిగిరెట్లు లభ్యమై నగర వాసుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. తాజాగా ఓ గుర్తు తెలియని వ్యక్తి తుపాకీల ప్యాకెట్ రోడ్డుపై పడేసిన సంఘటనపై నగరంలో పోలీసుల్ని పరుగులు పెట్టించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామాటాకీస్ వద్ద శ్రీకృష్ణా ట్రావెల్స్ ప్రతినిధి వద్ద తుపాకీలున్నట్టు ఈ నెల 23న త్రీటౌన్ పోలీసులకు సమాచారమందింది. దీంతో సీఐ హీత పార్లర్ రబాస్ సోర్స్ మల్లేశ్వరరావు, సంతోష్ కుమార్, హెచ్ఎస్ జనార్ధనరావు, కానిస్టేబుళ్లు సీహెచ్ సంతోష్ కుమార్, ఎం.వెంకట ప్రసాద్, మరో ఇద్దరి సీటీఎఫ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. ఎవరో పడేసి వెళ్లిపోయారంట అని తెలిపారు. శివాజీపాలేనికి చెందిన వేములకొండ శివ నాగరాజు (41) అనే వ్యక్తిని విచారించగా, రెడ్బస్ ట్రావెల్స్ కునాల్ శ్రీవాత్సవ అనే వ్యక్తి విశాఖ నుంచి బెంగళూరు వెళ్లేందుకు టిక్కెట్ బుక్ చేసుకున్నట్టు ప్రాథమికంగా తెలుసుకున్నారు. కునాల్ అనుమానాస్పదంగా కనిపించడంతో ఆయన బ్యాగ్‌ను తనిఖీ చేశానని, దీంతో ఆయన అక్కడి నుంచి పరారైపోయేందుకు ప్రయత్నించాడని, అదే సమయంలో ఆయన బ్యాగ్‌లో ఉన్న ఓ ప్యాకెట్ కిందపడిపోయిందని శివ నాగరాజు పోలీసులకు తెలిపాడు. అయితే ఆ ప్యాకెట్‌లో ఒక పిస్టల్, ఒక రివాల్వర్ (ఇంగ్లండ్ తయారీ), రెండు రౌండు బుల్లెట్లు, కేఎఫ్ 7.65 అనే ఖాళీ కేస్ ఉన్నట్టు గుర్తించాడు. అయితే ఈ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయకుండా శివ నాగరాజు దాచాడు. వాటిని శ్రీకృష్ణా ట్రావెల్స్ కార్యాలయంలో ఎవరికీ తెలియకుండా నాగరాజు దాచేశాడు. దీంతో పోలీసులు భారత ఆయుధాల చట్టం ప్రకారం శివ నాగరాజును అరెస్టు చేశారు. అతడి నుంచి ఓ ఐఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే ప్యాకెట్‌ను పడేసి పారిపోయిన కునాల్ శ్రీవాత్సవ్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మహిళా లైంగిక వేధింపుల కేసులో విశాఖ ఫిషరీష్ జేడీ లాల్ మహ్మద్ సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలోని ఫిషరీష్ జెడీ లాల్ మహ్మద్‌పై వేటు పడింది. జిల్లా కార్యాలయంలో పనిచేసే మహిళా జూనియర్ సహాయకురాలిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టు అయిన ఈ కామాంధకారిని మత్స్యశాఖ కమిషనర్ సూర్యకుమారి సస్పెండ్ చేశారు. విశాఖలోజేడీపై పోలీసు కేసే నమోదు కావడం, విషయం మీడియాలో పెద్ద ఎత్తున గుప్పు మనడంతో ప్రాథమిక విచారణ చేపట్టిన మత్స్యశాఖ తొలుత జిల్లాలోని ఏడికి ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో వాస్తవాలు బయటపడటంతో ప్రభుత్వమే సస్పెన్షన్ చర్యలకు ఉపక్రమించడం ఇపుడు మత్స్యశాఖలో సంచలనంగా మారింది. ఏకంగా జాయింట్ డైరెక్టర్‌నే ప్రభుత్వం సస్పెండ్ చేయడం ఈశాఖలోని అధికారులను ఒక్కసారిగా ఉలిక్కి పడేలా చేసింది. అయితే తనపై తప్పుడు కేసులు పెట్టి తన పరువు తీయాలని చూశారని, ప్రభుత్వం వద్ద మొరపెట్టుకునే ప్రయత్నం చేసినా, తనకు అనుకూలంగా ఉన్న మరో జిల్లా మత్స్యశాఖ అధికారి సహాయంతో మహిళా ఉద్యోగిని పెట్టిన వేధింపుల కేసు తీయించాలని ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఆధారాలన్నీ బలంగా ఉండటంతో మత్స్య శాఖకు చెడ్డపేరు రావడం ఇష్టం లేక ముఖ్యకార్యదర్శి అనుమతితో జెడి లాల్ మహ్మద్ పై వేటు పడింది. కాగా ఈయన పనిచేసిన ప్రతీచోటా ఇదే తరహా లైంగిక వేధింపుల కేసులే అధికంగా ఉన్నాయి. ఏకంగా జెడీనే సస్పెండ్ చేయడంతో మత్స్యశాఖలోని కాస్తో కూస్తో చాపకింద నీరులా ఘనకార్యాలు వెలగబెట్టేవారందరికీ భారీ హెచ్చరిక చేసినట్టు అయ్యింది. సదరు జెడీ పలువురు గ్రామీణ మత్స్య సహాయకుల నియామకాల సమయంలో ప్రభుత్వం కలిపిన గ్రేస్ మార్కులు కలపడానికి ఉద్యోగులను తీవ్రంగా కార్యాలయం చుట్టూ తిప్పించుకొని ఆఖరికి ఉద్యోగులకు పదోన్నతులు రాకుండా కూడా చేసేశారు. ఈ విషయమై పలువురు ఉద్యోగులు కమిషనరేట్‌కి వెళ్లినా ఫలితం లేకపోయింది.

అక్రమ మద్యం పట్టివేత

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిని పట్టుకున్నట్టు పద్మనాభం పోలీస్ స్టేషన్ సిఐ తెలిపారు. గంధవరం గ్రామానికి చెందిన కోయ్యడ అప్పారావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందగా సంఘటనా స్థలానికి సిఐ, ఎస్ఐ చేరుకుని అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి దగ్గర నుండి సుమారు 30 బాటిల్లు అక్రమమద్యాన్ని పట్టుకున్నారు. అలాగే పొట్నూరు గ్రామానికి చెందిన కంచర్ల పెంటమ్మ అక్రమ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందగా సిఐ, సిబ్బంది వెళ్లి రైడ్ చేయగా 15 బాటిల్లు అక్రమ మద్యం పట్టుబడినట్లు తెలియజేశారు. వీరు ఇరువురిని అదుపులోకి తీసుకొని ఏపీ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు.

విశాఖలో 22 లక్షల విలువైన ఈ-సిగరెట్లు సీజ్

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖ నగరంలో పోలీసులు దాడులు చేసి భారీగా పెద్ద మొత్తంలో ఈ-సిగరెట్లు సీజ్ చేశారు. నగరంలోని మీరా కలెక్షన్, దేజావు క్లాత్ షో రూంలలో దాడులు నిర్వహించి 2019లో బ్యాన్ చేసిన 743 ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు జాయింట్ సీపీ ఫకీరప్ప తెలిపారు. సుమారు రూ.22 లక్షల విలువ చేసే ఈ-సిగరెట్లను సీజ్ చేశామని, తమకు వచ్చిన సమాచారం మేరకు రెండు షాపుల్లో రైడ్ నిర్వహించి ఈ సిగరెట్లను పట్టుకున్నామన్నారు. ముంబై నుంచి ఈ-సిగరెట్లు ఇక్కడికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ సిగరెట్లలో నికోటిన్ శాతం ఎక్కువగా ఉండటం చేత మత్తు ఎక్కువ కలిగిస్తుందని, యువత ఈ సిగరెట్లు త్రాగడం వలన వేగంగా అనారోగ్య సమస్యలు వస్తాయని, ఈ కేసులో ఇద్దరినీ అరెస్ట్ చేశామని ప్రధాన నిందితుడు ముంబైలో వెంటిలేటర్‌పై ఉన్నాడని తెలిపారు. ఈ-సిగరెట్లు విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరంలో ఈ దాడులను ఇంకా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

కడపలో చేనేత కుటుంబం ఆత్మహత్యకు సీఎం జగనే కారణం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: కడప జిల్లాలో చేనేత కుటుంబం ఆత్మహత్యలు జగన్మోహన్ రెడ్డి చేసిన హత్యలేనని గాజువాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పాత గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కడప జిల్లా ఒంటిమిట్ట లో ఈ వైసీపీ ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో భూ బదలాయింపు చట్టం మార్పుతో అన్యాయమై ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న పాల సుబ్బారావు కుటుంబం భార్య పద్మావతి కుమార్తె వినయ ల ఆత్మహత్యలను ప్రజాస్వామ్య వాదులు అందరూ ఖండించాలని అన్నారు. వారి కుటుంబానికి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం వలన రెవెన్యూ అధికారులు తమ ఆస్తిని వైసీపీకి చెందిన శ్రావణి పేరున మార్చడంతో తీవ్ర మనస్థాపానికి గురైన కుటుంబం ఆత్మహత్య చేసుకుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు తమ్మిన విజయ్ కుమార్, గాజువాక నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షులు తమిరే శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటేశ్వరరావు, అధికార ప్రతినిధి విల్లూరి శివప్రసాద్, చేనేత విభాగం నాయకులు దొడ్డి వెంకట సత్యారావు, కోడి శ్రీనివాస్, వార్డు ఉపాధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, వార్డు

ప్రధాన కార్యదర్శి కదిరి పోలరాజు టిడిపి సీనియర్ నాయకులు నక్క లక్ష్మణరావు, తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

సందీప్‌కి టికెట్ ఇవ్వాలి: జనసేన

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: భీమిలి నియోజకవర్గం జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా జనసేన పార్టీ ఇంఛార్జి సందీప్ పంచకర్లని ప్రకటించాలని కోరుతూ భీమిలి నియోజకవర్గం 9 వార్డుల అధ్యక్షులు, 3 మండలాధ్యక్షులు, ముఖ్య నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు డాబా గార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. భీమిలి టికెట్‌ను పంచకర్ల సందీప్‌కి ఇవ్వాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ని, కూటమి పార్టీల అధ్యక్షులను వారు కోరారు. ఈ మేరకు జనసేన విశాఖ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి వివి కృష్ణయ్య మాట్లాడుతూ 2019 నుంచి ఇక్కడ సందీప్ ప్రజలకు అందుబాటులో వున్న సందీప్‌కి భీమిలి టికెట్ ఇవ్వాలి అని కోరారు. మీడియా సమావేశంలో జనసేన నేతలు మజ్జి సూరిబాబు, మజ్జి శ్రీనుబాబు, శ్రీకాంత్, తమ్మిన అప్పల రాజు, కురిమిన రామ స్వామి నాయుడు, పోతిన అనూరాధ, నాగోతి నాయుడు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురం: భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ టికెట్‌ను డాక్టర్ సందీప్ పంచకర్లకు కేటాయించాలని అప్పుడే కూటమిలో భాగంగా ఎక్కువ మెజార్టీతో జనసేన పార్టీ విజయాన్ని సాధిస్తుందని ఆనందపురం మండల బూత్ కన్వీనర్లు తాడివాడ ప్రశాంత్ కుమార్ నాయుడు, బోద్దాపు గోవిందు డిమాండ్ చేశారు. భీమిలి టికెట్ విషయంలో కూటమి పునరాలోచన చేసి సీటును కేటాయించాలని తెలిపారు.

చిరుధాన్యాలతో హోలీ చిత్రం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: హోలీ పండుగను వినూత్నంగా వైవిధ్యంగా నిర్వహించారు నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్ కుమార్. ముందుగా ప్రజల్లో ఆరోగ్యం పట్ల అవగాహన కలిగించడానికి చిరుధాన్యాల పట్ల చైతన్యం పెంపొందించే విధంగా మిల్లెట్స్ ను ఉపయోగించి హోలీ చిత్రాన్ని తయారు చేశారు. ప్రకృతిలో ఉన్న వైవిధ్యత మనం నిత్యం భుజించే ఆహారంలో ఉన్న సహజసిద్ధమైన రంగురంగుల గింజలను ఉపయోగించి ఈ చిత్రాన్ని దాదాపు పది రోజుల శ్రమించి తీర్చిదిద్దారు. అనంతరం తన వద్ద చిత్రకళ నేర్చుకుంటున్న విద్యార్థులతో కలిసి హోలీ పండుగను నిర్వహించారు. ప్రజల్లో మంచి సత్సంబంధాలను పెంపొందించడానికి హోలీ పండుగ వేదికగా నిలుస్తుందని నూతన బంధుత్వాలు, స్నేహాలు చిగురు తొడగడానికి ఈ పండుగ వేదికవుతుందని ప్రపంచమంతా రంగుల మయంగా, ప్రజలంతా సంతోషాలతో జీవించాలని ఈ పండుగ మనకి తెలియజేస్తుందని చిత్రకారుడు విజయ్ కుమార్ తెలిపారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్, వాల్తేర్ డివిజన్ ద్వారా 24 నుండి మే 15వ తేదీ వరకు నిర్వహించబడిన 5 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లల కోసం వేసవి కోచింగ్ క్యాంపును రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో అధ్యక్షుడు, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రెసిడెంట్ మంజుశ్రీ ప్రసాద్ హాజరయ్యారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, షటిల్ బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్ మరియు వాలీబాల్‌లతో సహా అనేక రకాల క్రీడలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్ గుప్తా, ఎడిఆర్ఎం (ఆపరేషన్స్) మనోజ్ కుమార్ సాహూ, స్పోర్ట్స్ ఆఫీసర్ ప్రవీణ్ భాటి, జాయింట్ స్పోర్ట్స్ ఆఫీసర్ బి.అవినాష్, జనరల్ సెక్రటరీ శ్రీరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు అండగా ఉంటా

మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం

విశాలాంధ్ర - గాజువాక: ఈ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించే కార్యకర్తలను గుర్తించి వారికి అండగా ఉంటానని గాజువాక నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. స్థానిక 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు (కేబుల్ మూర్తి) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మంత్రి అమర్నాథ్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి గౌరవం, గుర్తింపు ఇవ్వాల్సినటువంటి బాధ్యత మాపై ఉందని అన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా అనేక వేదికల నుంచి గడిచిన ఐదు సంవత్సరాలుగా ప్రభుత్వం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి తెలియజేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి మీరు కూడా ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కూడా తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా గాజువాక నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు వెళు తోందని ఎప్పుడు జరిగినటువంటి విధంగా జగన్మోహన్ రెడ్డి నాయ కత్వంలో శాసనసభ్యులు నాగిరెడ్డి దాదాపు 500 కోట్ల రూపాయలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ నియోజక వర్గంలో దాదాపు 2000 కోట్ల సంక్షేమ కార్యక్రమాలు అందించామని, 25 వేల మందికి ఇళ్ల పట్టాలిచ్చారని అమర్నాథ్ చెప్పారు. గాజువాకలో ప్రధా నంగా ఉన్నటువంటి గాజువాక హౌస్ కమిటీ సమస్యను పరిష్కరించారని ఆయన వివరించారు. గత ప్రభుత్వాలు ఎప్పుడూ కూడా చేయనటువంటి కార్యక్రమాలు ఈ నియోజకవర్గంలో జరిగాయని చెప్పారు. ఒక్కొక్కరు 100 మందిని ప్రభావితం చేసే నాయకులు ఇక్కడ ఉన్నారు. మీరు ప్రజల్లోకి వెళ్లి గడిచినటువంటి ఐదు సంవత్సరాలుగా జగన్మోహన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమాలు, గాజువాకలో జరిగినటువంటి అభివృద్ధి కార్యక్రమాలు మనం పేదవాడిని అందించిన సంక్షేమ పథకాల గురించి మీరందరూ తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 50 రోజులు కష్టపడితే మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని రాష్ట్రంలో పేదవాడికి మేలు చేసేటువంటి బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకుంటారని అమర్నాథ్ చెప్పారు. పార్టీ పెద్దలు కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలు ఒక్క మాట మీద ఉండి ఈ నియోజకవర్గంలో వైసీపీకి భారీ మెజార్టీ తీసుకురావాలని సూచించారు. దయాల్ నగర్ లో పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత గుడివాడ గురునాథరావుదని, ఈ ప్రాంత భాషలో అమర్నాథ్కు ఓటేసి గెలి పించాలని సూచించారు. కార్పొరేటర్ ఉరుకుటి చంద్రరావు మాట్లాడుతూ మూడు తరాల రాజకీయ అనుభవం కలిగిన గుడివాడ కుటుంబాన్ని ఈ ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. అమర్నాథ్ ఈ ప్రాంతానికి ఎమ్మెల్యేగా వస్తే అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముమ్మరం చేస్తారని, ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 68వ వార్డ్ ఇంచార్జి గుడివాడ లతీష్, మద్దాల అప్పారావు, రెడ్డి జగన్నాథరావు, ఈరోతి గణేష్, మంజుల, వార్డు మహిళా అధ్యక్షురాలు జుత్తు లక్ష్మీ, రాజాన వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ గిరిజన పాఠశాలకు చైతన్య స్రవంతి చేయూత

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ ఏజెన్సీలో గల ఒక ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తగు చేయూత ఇస్తున్నామని చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రహమాన్ చెప్పారు. చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ డాబాగార్డెన్స్ లోని వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. గిరిజన యువకుడు గీతం యూనివర్సిటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశాక డీఎడ్లో శిక్షణ పొందారు. ఆ గిరిజన యువకుడు సూరిబాబుది జీ.మాడుగుల మండలంలోని ఎం.సంగం సొంత గ్రామం. 2006లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపా ధ్యాయుడుగా నియమితులయ్యారు. స్కూల్లో పిల్లల కోసం ప్రజల్లో చైతన్యం తీసుకు వచ్చారు. అక్కడ విద్యార్థులు సంఖ్య 10 నుంచి 36కి చేర్చారు. ప్రభుత్వం రేకుల షేడ్ మాత్రమే ఏర్పాటు చేసారు .బెంచీలు తక్కువగా వున్నాయి ఇది తెలుసుకున్నాక అమెరికాలో వున్న స్నేహితులు స్పందించి చేయూత ఇచ్చారని వారికి సూరిబాబు ధన్యవాదాలు తెలిపారు. తనకు భావరాజు సర్వేశ్వరరావు, వెంకటరత్నం ట్రస్ట్ ప్రదానం చేసిన అవార్డు కింద ఇచ్చిన రూ.50 వేలు నగదుకి అదనంగా రూ 15 వేలు కలిపి మొత్తం 65వేల రూపాయలను 13బెంచీలు కొనుగోలుకు సూరి బాబుకి చైతన్య స్రవంతి అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ అందజేశారు. స్వచ్ఛ భారత్ అంబాసిడర్, ప్రొఫెసర్ బాలమోహన్ దాస్ మాట్లాడుతూ చైతన్య స్రవంతి ఎన్నో రకాల కార్య క్రమాలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. భావ రాజు ఫౌండేషన్ ద్వారా సర్వేశ్వర రావు, వెంకట రత్నం కుటుంబం అవార్డు కింద ఇచ్చిన నగదుని మారుమూల గిరిజన ప్రాంతంలోని ప్రాథమిక పాఠశాలకు విరాళంగా అందజేయడం అభినందనీయం అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూరిబాబు మాట్లాడుతూ జి.మాడుగుల మండలం ఎం.సంఘం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వసతి, బెంచీలు లేక పోవడన్ని గమనించిన డాక్టర్ షిరీన్ రహమాన్ అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. భావరాజు సర్వేశ్వర రావు వెంకటరత్నం ట్రస్ట్ అవార్డు పొందిన డాక్టర్ షిరీన్ రహమాన్ ను చైతన్య స్రవంతి సభ్యులు విజయ, రుకియభాను తదితరులు ఘనంగా సన్మానించారు.

వైసీపీకి రాజీనామా చేస్తున్నా..!

గుంటూరు వెంకట నరసింహమూర్తి

విశాలాంధ్ర - పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుంటూరు వెంకట నరసింహమూర్తి తెలియజేశారు. 1995లో కాంగ్రెస్ పార్టీ నుండి రాజకీయ అరంగేట్రం చేసిన తాను స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి వీరాభిమానిగా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ వచ్చానని వెల్లడించారు. ఆ తర్వాత 2011 నుండి రాజశేఖర్ రెడ్డి కుమారుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో కలిసి నేటి వరకు నడుస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ నాయకుల వ్యవహార శైలి తనను ఎంతో బాధిస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సీనియర్ల పట్ల ఎంతో చులకన భావన చూపుతూ నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా పొరపాట్లను సరిదిద్దుకుంటానని హామీ ఇచ్చిన అదీప్ రాజ్, ఆ తర్వాత మరింత అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అలాగే పెందుర్తిలో కాపు సామాజిక వర్గీయులు ఎక్కువమంది ఉన్నందున వారికే సీటు ఇవ్వాలన్న తన అభ్యర్థన పైనా పార్టీ అధిష్టానం స్పందించకపోవడం బాధ కలిగించిందన్నారు. ఈ నేపథ్యంలో పార్టీలో కొనసాగుతూ అవమానాలు భరించడం ఇష్టం లేక రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈనెల 25న సోమవారం తనతో పాటు పలువురు నాయకులు కూడా వైసీపీకి రాజీనామా చేస్తారని వెంకట నరసింహమూర్తి తెలియజేశారు.